# వ్యాఖ్యాతలు

"స్వారాజ్యలక్ష్మి లేచిపోయింది!" "స్వారాజ్యలక్ష్మి లేచిపోయింది!!"

ఆరోజు ఎక్కడవిన్నా ఇవే గుసగుసలు- సరిగ్గా ఇవేమాటలు-

"ఎవరితోని?"- "ఎక్కడికి?" ఈ ప్రశ్నా పరంపరలకి అంతులేదు.

ఢిల్లీకి వెళ్ళిందని కొందరు- "మద్రాస్‌కు లేచిపోయిందని" మరి కొందరు-

"తురకాడితో, రెడ్డితో, బ్రాహ్మడితో-" ఇట్టివే రకరకాల సమాధానాలు-

"అసలువిషయం ఏమిటని?" ఆ ఉదయమే మా యింటికి వచ్చిన సూర్యాన్ని అడిగాను-

"ఏముంది? పడుచుపిల్ల- ఎవడితోనో లేచిపోయి ఉంటుం"దని సూర్యం తేల్చివేశాడు-

"నిక్షేపంలాంటి భర్త- పండంటి కాపురం- లేచిపోవడానికి దీనికేమి పోయేకాలం వచ్చిం"దని రెట్టించాను.

"లేచిపోదల్చుకున్నప్పుడు భర్త కాపురం, ఇవేవీ అడ్డురావని" పెదవి విరిచాడు సూర్యం—

"మనిషి అన్నప్పుడు నీతీ నియమం ఉండక్కరలేదూ?" అని విసిరికొట్టాను ధూకుడుగా-

"నీతి నియమం ఉంటే ప్రపంచమంతా ఒక భూతలస్వర్గంగా మారేద"ని చప్పరించివేసాడు సూర్యం. "ఎవరితో, ఎక్కడికి లేచిపోయిందని" సూర్యాన్ని ప్రశ్నించాను-

"పక్కింటి శీనుతో ఢిల్లీకి వెళ్ళిందని" సూర్యం సమాధానం చెప్పాడు-

ఈ జవాబు నా కేమీ సంతృప్తిని కలిగించ లేదు. సూర్యం, క్లుప్తంగా తేల్చేసినందుకు లోలోపల ఎంతోవిచారిస్తూ, పైకి "వివరాలేమైనా తెలియ వచ్చాయా" అని అడిగాను.

"వివరా లేమి ఉన్నాయి? యిరువురికీ కొంత కాలంనించి బాగా స్నేహం- ఆ స్నేహం క్రమంగా ప్రేమలోకి మారింది. శీను, ఆ తొలి ప్రేమతో కైపెక్కి- స్వరాజ్యలక్ష్మికి చలనచిత్ర పరిశ్రమపై గొప్ప వ్యామోహం కలిగించాడు- ఒక సుముహూర్తాన యిరువురూ సినిమాలో చేరుదామనే నిశ్చయానికి వచ్చారు- దానితో వళ్ళు తెలియని ధూకుడులో స్వరాజ్యలక్ష్మి చేతికి దొరికిన నగలు, నాణాలు అందుకొని ఆ అభాజ నుడితో లేచిపోయిందని" చెప్పాడు సూర్యం—

"ఎంతడబ్బు తీసికెళ్ళిం దేం?"

"నాలుగువేలకి పైగా చేతికందిందని వినికిడి-"

ఈ విషయం మాత్రమే చెప్పడానికివచ్చినట్లు, అదికాస్త చెప్పడం పూర్తి కావడంతోనే, కాఫీకి ఉండమని ప్రాధేయపడ్డా ఆగక ఏదో తొందరపని ఉందని చెప్పి, సూర్యం అక్కడినించి ఉత్తరక్షణంలోనే వెళ్ళిపోయాడు.

* * * *

హోటల్‌లో "రాము" కలిసి, మాటలసందర్భంలో స్వరాజ్య లక్ష్మి ప్రస్తావన తెచ్చాడు- కాఫీ హోటల్‌లో పోగైన నలుగురుమిత్రులు, తలకి ఒకమాట అనడం మొదలెట్టారు—

'ఎంతో అమాయికంగా కనపడేది స్వరాజ్యలక్ష్మి-యింతగడుసుదని నేను ఎన్నడూ కలలోనైనా అనుకోలేదని" పెదవి విరిచాడు రఘు—

"దీనికి లేచిపోవడానికి ఆ తేభ్యమే దొరకాలా, గట్టిగా కొడితే ఆ శీనుగాడు సరిగ్గా ఏడ్వనైనా లేడు'' అని అభిప్రాయపడినాడు రాము—

"ఆమె శీనుతో లేచిపోయిందని ఎవరుచెప్పారు? వాడిమొహానికి వాడు ఒక అమ్మాయినికూడా లేవదీసుకుపోవడమా!'' అని అన్నాడు మధు. తాను ఇదివరకే వంద "రొమాన్సు''లు చవిచూచిన ధీమాతో—

"సూర్యం ఉదయమే నాకీసంగతి చెప్పాడ''ని నేను అన్నాను—

''అయితే మీకెవ్వరికీ అసలు సంగతి తెలియదన్నమాట!!'' అని అందుకున్నాడు మధు—

మేము గట్టిగా "తెలుసునన లేక'' మౌనం వహించాం. మధు ఠీవిగా సిగరెట్టు వెలిగించి, టీ పొగలతో సిగరేటు పొగలను మేళవిస్తూ "అసలు సంగతి'' చెప్పడం మొదలెట్టాడు—

"స్వరాజ్యలక్ష్మి తండ్రి రఘురామయ్యగారి యింట్లో, చంద్రయ్య అనే ఒక గుమాస్తా ఉండేవాడు- బహుశా వాడిని మీరంతా చూసే వుంటారు. చిన్నతనంలోనే తలిదండ్రులు పోవడంవల్ల రఘురామయ్యగారు వాడిని తమయింట్లోనే ఉంచుకొని, వాడికి విద్యాబుద్ధులు గరిపారు-పెంచి పెద్దవాడిని చేశారు. చంద్రయ్య ఆ కృతజ్ఞతనైనా రఘురామయ్య గారిపట్ల చూపకుండా, వివాహమైన పిల్లను లేవదీసుకొని వెళ్ళాడు— పిల్లతోపాటు సొమ్మూ, సంబంధమేకాక పదివేల నగదుకూడా కొట్టు కెళ్లాడు''—

"రఘురామయ్యగారు వాడిపైన కేసేమైనా పెడుతున్నారా?'' అని నేను అడిగాను.

"స్వరాజ్యలక్ష్మిని వారు ఎంతో ప్రేమిస్తారు. ఆమె చంద్రయ్యతో లేచిపోయిందని విని, నిలువునా నీరైపోయినారు. ఇదమిద్ధమని ఏదీ ఆలోచించలేని స్థితిలోకి వచ్చారు.''

ఇంతలోకే టీలుతాగడం పూర్తి అయింది. హొటల్ వాడికి ముడుపు చెల్లించి ఎవరిపనులపైన వారు బయల్దేరాము.

*   *   *   *

ఇంటికి వెడుతుండగా దారిలో పురుషోత్తం కనపడ్డాడు- కనీకన పడడంతోనే స్వరాజ్యలక్ష్మి ప్రసక్తి తెచ్చాడు—

"స్వరాజ్యలక్ష్మి సంగతి తెలిసిందా?"

"ఆ తెలిసింది- చంద్రయ్యతో లేచిపోయిందటకదూ-"

"చంద్రయ్యతోనని ఎవరుచెప్పారు?"

"ఇంతకుముందే మధు చెప్పాడు"

"శుద్ధ అబద్ధం"

"అయితే శీనుతో లేచిపోయివుంటుందని" అన్నాను, పురుషోత్తం నిరాకరణకి విస్తుపోతూ-

"లేదు అదికూడా అబద్ధమే"

"మరి ఎవరితో లేచిపోయింది?"

రాజమౌళితో......

"ఇంతకూ నీకేమీ తెలియదన్నమాట- అయితే విను, అసలుసంగతి చెబుతా"నని స్వరాజ్యలక్ష్మికథను ప్రారంభించాడు-

"సరే"నని తల పంకించాను-

రాజమౌళి రఘురామయ్యగారికి ఏదో దూరపు బంధువు- అతడు రెండురోజులక్రితం ఇక్కడికి ఏదోపనిమీద వచ్చాడు. స్వరాజ్యలక్ష్మిని వెంటనే మంత్రం పెట్టినట్లు, తనవేపు తిప్పుకున్నాడు. ఆ అమ్మాయి, ఆతర్వాత అతన్ని ఒక క్షణమైనా చూడకండా ఉండేదికాదు. నిన్న ఉదయం, అతను, తీరా తనఊరికి బయల్దేరడానికి సిద్ధం కావడంతోనే "నిన్ను విడిచి నేను చివరకి ఒక క్షణమైనా ఉండలేను. నాకు నీతోడిదే

లోకం'' అని మంకుపట్టుపట్టి, పట్టపగలే అతనితో లేచిపోవడానికి ప్రియత్నించింది. ఇది చూచి సహించలేక, ఆమె తలిదండ్రులు స్వరాజ్య లక్ష్మిన్ని చావబాదారు. ఈ రభసంతా చూడలేక, రాజమౌళి అప్పటి మట్టుకు తన ప్రియాణాన్ని ఆపుదల చేసాడు. రాత్రి భోజనాల తరువాత, ఇంటిల్లిపాదు ఉదయం జరిగిన రభసకి అలసి, శరీరాలు మరిచి నిద్ర పోయారు. తెల్లవారేసరికి స్వరాజ్యలక్ష్మిన్ని రాజమౌళీ ఎక్కడా కనపడ లేదు. వారితోపాటు కొంత సొమ్ముకూడ కనపడలేదని గిట్టనివాళ్ళు చెప్పుకోవడం కద్దు''

పురుషోత్తం కథనం నాలో ''ఏదినిజం? ఏదిఅబద్ధం'' అనే జిజ్ఞాసను కలుగజేసింది. అసలు విషయం తెలుసుకోవలెననే ఆసక్తిని యినుమడింప జేసింది.

స్వరాజ్యలక్ష్మిన్ని, రాజమౌళి, చంద్రయ్యా, శీను ఒకరితరువాత ఒకరు నా కళ్ళముందు సినిమాకిమల్లె తిరగడం మొదలెట్టారు. బుర్ర గిర్రున తిరిగింది. ''నీవు చెప్పినదంతా శుద్ధ అబద్ధమని'' పురుషోత్తాన్ని విసిరికొట్టి, దానికి అతను చెబుతున్న సమాధానంకూడా వినకండా, చప్పున రఘు రామయ్యగారి యింటివేపు దారితీసాను.

*      *      *      *

''అసలు సంగతి ఏమిటి?'' అన్న ప్రశ్న నన్ను దారిపొడుగునా వేధించింది. ఏకలక్ష్యంగా, ఇదేవిషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూ చరాచరా నడిచి వెడుతున్నాను. స్వరాజ్యలక్ష్మిన్ని, శీను, చంద్రయ్యా, రాజమౌళీ నామనోనేత్రంముందు తిరుగుతూనే ఉన్నారు. స్వరాజ్యలక్ష్మిన్ని... శీను... చంద్రయ్యా... రాజమౌళీ...

ఇంతలోనే దారిలో రఘురామయ్యగారి యింటిపక్కన ఉండే శ్రీనివాసరావు, కాదు ''శీను'' నాకళ్ళముందు ప్రత్యక్షమైనాడు.

"శ్రీనివాసరావు! శ్రీనివాసరావు!" అని గట్టిగా అరిచాను. అతను దగ్గరికి రావడంతోనే "స్వరాజ్యలక్ష్మి సంగతి ఏమిటని?" అడిగాను.

అతను నా ప్రశ్నకి సమాధానం చెప్పకండా నన్ను ఎగాదిగా చూచాడు.

"ఏమిటె అట్లా చూస్తావని" ప్రశ్నించాను.

"నీప్రశ్న నాకేమీ అర్థంకావడంలేద"న్నాడు.

అతను ఆవిధంగా అనడం, ఆశ్చర్యం కలిగించింది. ఇంక ఆట్టే ఆలస్యంచేయడం యిష్టంలేక, స్వరాజ్యలక్ష్మి ఎవరితోనో లేచిపోయిందని విన్నాను. నిజమేనా?" అనిఅడిగాను.

అతను చప్పుననవ్వి, "ఎవరితో ఏమిటి?" అని అన్నాడు. ఆ నవ్వుకి నాకు ముచ్చెమటలు పోసాయి. గుండె దడ ఆగింది.

"ఎవరిలో అని అట్లా అడుగుతావెందుకు? ఎవరో రాజమాళితో నని విన్నాను."

ఆమాటలకు తిరిగి అతను గొల్లుమన్నాడు. నాకు అతని వాలకం బొత్తిగా అర్థంకాలేదు.

"ఎవరితోనూ లేచిపోలేదా?" అని ఎంతో నిరాశగా అడిగాను.

"లేచిపోవడానికి ఆమెకి ఏమిఖర్మం పట్టింది?" అని శ్రీనివాసరావు నా ప్రశ్నని తిప్పికొట్టాడు.

"ఊరంతా ఆమె లేచిపోయిందని పుకారుగావుందే!" అనిఅన్నాను.

"మనలాంటి ప్రబుద్ధులు ఉంటే, ఊళ్ళోపుకార్లు పుట్టడం ఎంతసేపు?"

ఈ హెచ్చరిక నన్ను అవమాన పరిచింది. నీలాపనిందలు బయల్దేర దీసే వాళ్ళలో నన్నుకూడా ఒకడిగా జమకట్టింది.

"రఘురామయ్యగారి యింట్లో యిప్పుడు చంద్రయ్య ఉన్నాడా?" అని ప్రశ్నించాను.

"లేకేమవుతాడు - అతనితో స్వరాజ్యలక్ష్మి లేచిపోయిందని నీకెవరైనా చెప్పారా?" అని తిరిగి శ్రీనివాసరావు గొల్లుమన్నాడు.

"ఔనని కానీ" "లేదని కానీ" చెప్పడానికి నాకు నోటమాట పెకల్లేదు.

"ఇంతకీ అసలు సంగతేమిటని" ప్రశ్నించాను.

"సంగతేముంది? రెండు రోజులక్రితం స్వరాజ్యలక్ష్మి భర్త, తనకు ఇక్కడికి రావడానికి వీలుపడక ఆమెను అత్తవారియింటికి తీసుకొని రావడానికి "రాజమౌళి" అనే ఒక స్నేహితుడిని పంపించాడు. అతను వచ్చిన మర్నాడు, స్వరాజ్యలక్ష్మిని, తనతో ఆమె భర్త దగ్గరికి పంపించవలసినదని కోరాడు. అత్తమామలు అల్లుడి మధ్య ఏవో మనఃస్పర్థలు ఉండడంవల్ల, వారు, స్వయంగా అల్లుడువచ్చి తీసికెడితే తప్ప, అమ్మాయిని పంపించడానికి వీలులేదని నొక్కి చెప్పారు. స్వరాజ్యలక్ష్మి ఈ నిర్ణయానికి ఎదురుతిరిగి, తాను భర్తదగ్గరికి వెళ్ళక తప్పదని మొండికేసింది. తలిదండ్రులు, ఇక చేసేదేమీలేక, ఈఉదయం బండికి, రాజమౌళితో స్వరాజ్యలక్ష్మిని మద్రాసుకు భర్తయింటికి పంపించారు" అని శ్రీనివాస్‌రావు ముగించాడు.

చప్పున నాకు పురుషోత్తం కథనం జ్ఞాపకమొచ్చింది. రాజమౌళి, స్వరాజ్యలక్ష్మిని మంత్రంపెట్టి తిప్పుకోవడం... ఆమె ఒక క్షణమైనా అతన్ని విడిచి ఉండలేక పోవడం... తల్లిదండ్రులు ఆమెని చావ బాదడం... తెల్లవారేసరికి రాజమౌళీ, స్వరాజ్యలక్ష్మి ఎక్కడా కనబడక పోవడం మొదలైన అంశాలన్నీ స్ఫురణకి వచ్చాయి. శ్రీనివాసరావు సత్యకథనం ద్వారా నాసందేహాలన్నీ మబ్బులకు మల్లె విచ్చుకుపోయినాయి.

శ్రీనివాసరావు తన కథనం ముగించడంతోనే "మనవాళ్ళ ధోరణే వేరు. ఇదిగోపులి అంటే, అదిగోతోక అంటారు. అసత్యానికి రంగులుపూసి,

సత్యంగా నిలుపుతారు. తమవింతదృష్టికితామే చకితులై కేరింతలుకొడుతారు’’ అని అన్నాను-

“పాపం స్వరాజ్యలక్ష్మిని అనవసరంగా నిందలపాలుచేసారని’’ అన్నాడు శ్రీనివాసరావు.

ఈవాక్యంతో నాకళ్ళముందు సూర్యం, మధు, పురుషోత్తంగిరుగిన తిరగడం మొదలు పెట్టారు.

సూర్యం...మధు...పురుషోత్తం... వారిచిత్రాలని బలవంతంగా నాకళ్ళముందునించి తుడ్చివేసి, శ్రీనివాసరావు దగ్గర శలవు పుచ్చుకున్నాను.

“తేభ్యం’’... “అభాజనుడు’’ “...వాడిమొహం...’’ అనే మాటలు నాచెవులలో గింగురుమన్నాయి.

---